



నైరాశ్యంతోనే వీడ్కోలు

- శాశ్వత ఆహ్వానితుల హాజరు అంతంతమాత్రమే
- ఐదేళ్లలో 23 జడ్పీ సర్వసభ్య సమావేశాలు
- వచ్చిన నిధులు రూ.20.04 కోట్లు
- కనీస గౌరవం దక్కలేదని జడ్పీటీసీ, ఎంపీపీల్లో అంతర్మథనం
- నేటితో జిల్లా, మండల పరిషత్‌ల పాలకవర్గాలు ఖాళీ
- రేపటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

నైరాశ్యంతో ఎవరికి చెప్పుకోలేక, కనీస గౌరవం లేక అంతర్మథనంతో ఐదేళ్ల గడిపిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు చివరకు ఉత్సవ విగ్రహాలుగానే మిగిలామని ఆవేదనతో పదవీ విరమణ చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మంది జడ్పీటీసీలు, 123 మంది ఎంపీటీసీలు ఉన్నారు. 2019 ఎన్నికల్లో జడ్పీటీసీల్లో కాంగ్రెస్ నుంచి ఒకరు మాత్రమే గెలుపొందగా మిగతా సభ్యులు బీఆర్ఎస్‌కు చెందినవారు ఉన్నారు. ఎంపీటీసీల్లో బీఆర్ఎస్‌కు చెందిన వారు 71 మంది, కాంగ్రెస్ 18 మంది, బీజేపీ 7, ఇతరులు 25 మంది గెలుపొందారు. అప్పుడు అధికారంలో బీఆర్ఎస్ ఉండడంతో ఎంపీటీసీలు ఆ పార్టీలో చేరారు. అధికార పార్టీలో చేరినా నిధులు, విధులు లేక అసంతృప్తితో పదవీకాలం కొనసాగిందని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ జడ్పీ సమావేశంలో సభ్యులకు ఏదీ గౌరవం అంటూ అధికారుల తీరుపై నిరసించిన సందర్భాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం నిధులు చివరి సంవత్సరాల్లో కాస్తా ఊరటనిచ్చినా జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు కనీస బాధ్యతలు, నిధులు, విధులు కేటాయించాలని నిరసనలు తెలిపిన సందర్భాలు ఉన్నాయి. ఎంపీటీసీ స్థానంలో కనీసం చెప్పుకునే స్థాయిలో నిధులు రాలేదని గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యుడికి ఉన్న గౌరవం, మర్యాద కూడా ఇవ్వలేని పరిస్థితులపై ఎంపీటీసీలు నిరసన వ్యక్తం చేశారు. మండల పరిషత్‌కు 2014కు ముందు కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘాల నిధుల్లో 35 శాతం వాటా ఉండేది. అదే విధంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, బీఆర్‌జీఎఫ్ నిధులు వచ్చేవి. ఎంపీటీసీలు ఏడాదికి కనీసం రూ.10 లక్షల మేరకైనా పనులు చేసేవారు. 2014 తరువాత కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు కేటాయించడంతో జిల్లా, మండల పరిషత్‌లకు నిధుల కొరత ఏర్పడింది. ఆర్థిక సంఘం నిధుల పైనే ఆధారపడాల్సిన పరిస్థితులు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలైన నిధులు మండలాలు, గ్రామాల అభివృద్ధితో పాటు పాలన పరమైన ఖర్చులకు కూడా సరిపోని దుస్థితి ఎదురైంది.

జడ్పీలో 23 సమావేశాలు

2019 జూలై 5న కొలువుదీరిన జిల్లా జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ పాలకవర్గం గడువు గురువారంతో ముగియనుంది. ఈ క్రమంలో బుధవారం చివరి జడ్పీ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పాలకవర్గం పదవీకాలం పూర్తవుతున్న ఐదేళ్ల కాలంలో 23 సర్వసభ్య సమావేశాలు, మూడు ప్రత్యేక సర్వసభ్య సమావేశాలను పాలక వర్గాలు నిర్వహించాయి. పాలకవర్గ సమావేశాలు మొక్కుబడిగానే సాగాయి. నిధులు లేకపోవడంతో అభివృద్ధి అంశాలపై పెద్దగా చర్చ లేకుండానే ముగుస్తూ వచ్చాయి. అధికార పక్షం జడ్పీటీసీలే మెజార్టీగా ఉండ డంతో కేవలం అధికారుల తీరుపై నిరసన మినహా ఐదేళ్ల సాధారణంగా గడిచిందని చెప్పుకోవచ్చు.

పెరిగిన వేతనాలు

జడ్పీ చైర్మన్, జడ్పీటీసీలు, ఎంపీపీ, ఎంపీటీసీలకు తెలంగాణ ఏర్పడిన తరువాత పరిషత్‌లకు నిధులురాక నీరసించినా వారికి వేతనాలు మాత్రం పెంచారు. గతంలో రూ.25 వేలు మాత్రమే ఉండే జడ్పీ చైర్మన్ వేతనం నెలకు రూ.లక్షతో పాటు ఇతర అలవెన్స్‌లు ఇచ్చారు. జడ్పీటీసీ సభ్యుడు, మండల పరిషత్ అధ్యక్షుడికి రూ.10వేలు, ఎంపీటీసీలకు రూ.5 వేల వేతనం పెంచారు.

ఐదేళ్లలో జడ్పీకి రూ.20.04 కోట్లు

గడిచిన ఐదేళ్ల కాలంలో రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్‌కు రూ.20.04 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇందులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.51 కోట్లు ఉన్నాయి. జడ్పీ జనరల్ ఫండ్ రూ.1.65 కోట్లు, ఇతర అభివృద్ధి నిర్మాణాలకు సంబంధించి రూ.8.57 కోట్లు, నిధులు ఉన్నాయి. జిల్లాకు తక్కువ స్థాయిలోనే నిధులు విడుదలయ్యాయి.

జిల్లా పరిషత్‌కు కేంద్ర ప్రభుత్వ పురస్కారం..

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్‌కు కేంద్ర ప్రభుత్వం ఏటా అందించే దీన్‌దయాళ్ పంచాయత్ సశక్తి కరణ్ అవార్డు లభించింది. ఈ అవార్డు కింద రూ.50 లక్షల నగదు పురస్కారం లభించింది. ఈ నిధులు కూడా కాస్తా ఊరటనిచ్చాయి.

ప్రత్యేక అధికారుల పాలనకు సిద్ధం

జిల్లా పరిషత్, మండల పరిషత్‌పాలకవర్గాల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో గురువారం నుంచి ప్రత్యేక అధికారుల పాలనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల నియామక ప్రక్రియను చేపట్టారు. అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవకాశం ఉండడంతో ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగనుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది.

పాలకవర్గానికి ఘనంగా సన్మానం



పాలకవర్గ సభ్యులకు మెమొంటోలు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

జిల్లా పరిషత్ పాలకవర్గం గడువు ముగుస్తున్న నేపథ్యంలో బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి దంపతులతోపాటు జడ్పీటీసీలు, ఎంపీపీలను అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సన్మానించారు. జడ్పీ సీఈవో ఉమారాణి, డిప్యూటీ సీఈవో గీత, జిల్లా అధికారులు సూర్యప్రకాష్, వినోద్, డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, లక్ష్మీరాజం, వీరబుచ్చయ్య, శేషాద్రి, జ్యోతి, జానకి, రాజేశ్వరి, సాగర్, భాస్కర్, అమరేందర్ పాలకవర్గ సభ్యులను సన్మానించారు. వేములవాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళాచక్రపాణి, రామతీర్థపు మాధవి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ సన్మానించారు.

ప్రోత్సాహం మరువలేనిది

- పాలకవర్గం సభ్యులపై అధికారుల ప్రశంసలు
- రైతు భరోసా అందరికీ ఇవ్వాలని తీర్మానం
- జడ్పీ చివరి ప్రత్యేక సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

జిల్లా పరిషత్ పాలకవర్గం జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు అధికారులకు అందించిన ప్రోత్సాహం మరువలేనిదని ప్రశంసలు కురిపించారు. బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఐదేళ్ల కాలంలో ఎంతో ప్రోత్సాహాన్ని అందించారని, కొవిడ్ సమయంలో పాలకవర్గాలు కృషితో కరోనాను జయించామని అన్నారు. అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై సూచనలు, సలహాలను అందించారని అన్నారు. జిల్లాలో ఆగిన అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే రైతు భరోసా సాగులో ఉన్న భూమికి అందించాలని కౌలు రైతులకు అందించే భరోసాపై విధి విధానాలు జారీ చేయాలని సభ్యులు తీర్మానించారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, జడ్పీటీసీలు కత్తెరపాక ఉమ, నాగం కుమార్, గట్ల మీనయ్య, మ్యాకల రవి, ఏశ వాణి, గుండం నర్సయ్య, చీటి లక్ష్మణ్‌రావు, గుగులోతు కళావతి, కొమిరిశెట్టి విజయ, కో ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, ఎంపీపీలు చందయ్యగౌడ్, కరుణ, గంగం స్వరూప, బూల, పిల్లి రేణుక, జడ్పీ సీఈవో ఉమారాణి, డిప్యూటీ సీఈవో గీత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి

- జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ

సమష్టి కృషితోనే రాజన్న సిరిసిల్ల జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపామని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. ఐదేళ్ల కాలంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా విశేషంగా కృషి చేసిన సభ్యులందరికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శనం, ఎమ్మెల్యే కేటీఆర్ సూచనలతో జిల్లా సర్వతోముఖాభివృద్ధి జరిగిందని అధికారులు, సభ్యులందరూ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. సమష్టి కృషితోనే రాష్ట్రం, దేశంలో జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపామన్నారు. ఉత్తమ జిల్లా పరిషత్ అవార్డును సాధించామన్నారు. జిల్లాకు తొలి చైర్‌పర్సన్‌గా ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులను కొనసాగించాలి

- జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

జడ్పీ ద్వారా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా పూర్తి కావాల్సినవి ఉన్నాయని వాటిని కొనసాగించాలని జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు సూచించారు. జిల్లా అధికారులతో కలిసి పనిచేశామని, ఎంతో సహకరించారని అన్నారు. రైతు భరోసాలో భూమిని సాగు చేస్తున్న రైతులందరికీ సహాయాన్ని అందించాలని, కౌలు రైతులపై స్పష్టత ఇవ్వాలని అన్నారు.

యారన్ సబ్సిడీ రూ.4.32 కోట్లు విడుదల

సిరిసిల్ల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్డర్లు లేక ఇబ్బందులు పడుతున్న సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు విడుదలైన యారన్ సబ్సిడీ ఊరటనిచ్చింది. బుధవారం సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు 2022 సంవత్సరానికి సంబంధించి పది శాతం యారన్ సబ్సిడీ కింద 3819 మంది కార్మికులకు రూ.4.32 కోట్లను టెస్కో విడుదల చేసింది. యారన్ సబ్సిడీ పథకం 2018లో ప్రారంభించారు. 2018కి సంబంధించి 4128 మంది కార్మికులకు రూ.6.68 కోట్లు, 2019కి సబంధించి 4931 మంది కార్మికులకు రూ.8.43 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. 2020 సంవత్సరానికి సంబంధించి 5374 మంది కార్మికులకు రూ.8.78 కోట్లు, 2021 సంవత్సరానికి సంబంధించి 5028 మంది కార్మికులు రూ.8.77 కోట్లు జమ చేశారు. తాజాగా 2022 సంవత్సరానికి సంబంధించిన సబ్సిడీ కూడా విడుదల చేశారు. 2023 సంవత్సరానికి సంబంధించి సబ్సిడీ కార్మికులకు రావాల్సి ఉంది.

అభిప్రాయాలు తెలుసుకునేందుకు సమావేశాలు

ఇల్లంతకుంట, జూలై 3: ప్రభుత్వం అమలు చేయనున్న రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి బుద్దనాయుడు తెలిపారు. మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని రైతువేదికలో బుధవారం ప్యాక్స్ చైర్మన్ అన్నాడి అనంతరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిరవహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు అనంతరెడ్డి, వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, డైరెక్టర్లు రాంరెడ్డి, నారాయణరెడ్డి, శ్యామల, నాగలక్ష్మి, సీఈవో మల్లేశం, ఏఈవో జ్యోతి పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్, రూరల్ సీఐలుగా కృష్ణ, మొగిలి

సిరిసిల్ల క్రైం, జూలై 3: సిరిసిల్ల టౌన్ సీఐగా కస్పరాజు కృష్ణ, సిరిసిల్ల రూరల్ సీఐగా కె. మొగిలిని నియమిస్తూ మల్టీజోన్-1 ఇన్‌చార్జి ఐజీ సుధీర్ బాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సిరిసిల్ల టౌన్ సీఐగా పని చేసిన రఘుపతి, రూరల్ సీఐగా పనిచేసిన సదన్‌కుమార్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్‌చేస్తూ ఆదేశాలు జారీచేశారు. ట్రాన్స్‌కో సీఐగా ఉన్న కృష్ణను సిరిసిల్ల టౌన్ సీఐగా, సీటీసీలో ఉన్న మొగిలిని సిరిసిల్ల రూరల్ సీఐగా నియమించారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

తంగళ్లపల్లి, జూలై 3: తంగళ్లపల్లి మండల కేంద్రంలో యూత్ క్లబ్ అదనపు గది నిర్మాణానికి ఎంపీపీ పడిగెల మానస రాజు, జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి, స్థానిక ఎంపీటీసీ కోడి అంతయ్య బుధవారం భూమి పూజ చేశారు. ఎంపీటీసీ నిధులతో ముదిరాజ్ సంఘంలో బోరు మోటారు, ఏసీడీపీ నిధులతో సంఘం బ్యాలెన్స్ పనులతోపాటు ఎంపీటీసీ నిధులు రూ.3 లక్షల పదివేల రూపాయలతో వడ్డెర కాలనీలో మురికి కాలువ నిర్మాణ పనులను ఎంపీపీ పడిగెల మానస ఎంపీటీసీ కోడి అంతయ్య ప్రారంభించారు. ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, వైస్ చైర్మన్ ఎగుమామిడి రమణారెడ్డి, మాజీ ఎంపీపీలు గజభీంకర్ రాజన్న, పూసపల్లి సరస్వతి, మాజీ సర్పంచ్ కోడం సంధ్య, జాగృతి మండల అధ్యక్షులు కందుకూరి రామగౌడ్, నేరెళ్ల నర్సింగం, బండి జగన్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గడ్డమీద అంతయ్య, వడ్డెర సంఘం అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న కోడెల పంపిణీకి భారీ స్పందన

వేములవాడ కల్చరల్, జూలై 3: దక్షిణకాశీ వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయ గోశాలలోని కోడెల పంపిణీకి విశేష స్పందన లభించింది. అర్హులైన రైతులకు, ఆలయ గోశాలలు, ప్రైవేటు గోశాలలు నిర్వహించేవారు, హిందూ మఠాలకు సంబంధించిన వారికి కేటాయించాలన్నారు. ఒకవేల వీటి నుంచి దరఖాస్తులు రాని పక్షంలో రైతు సంఘాలకు, సొసైటీలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో బుధవారం గోశాల వద్దకు ఆసక్తి గల రైతులు, గోశాల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోడెల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గోశాలకు రావడంతో పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఈ సందర్భంగా గోశాల సమీపంలోనే ఆలయ ఏఈవోలు దరఖాస్తులు స్వీకరణ చేపట్టడంతో రైతులు, గోశాల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. సుమారుగా 350 నుంచి 400 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మొదటి రోజున 50 మందికి కోడెలు పంపిణీ చేయగా మిగత వారికి గురువారం నుంచి పంపిణీ కొనసాగుతుందన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయాల సేకరణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

ఎల్లారెడ్డిపేట, జూలై 3: ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను సేకరించి సర్కారుకు నివేదించనున్నామని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ మాట్లాడుతూ రైతు భరోసా పథకంపై రైతుల తమ అభిప్రాయాలను వెల్లడించాలన్నారు. అభిప్రాయ సేకరణ కోసం సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. సేంద్రీయ వ్యవసాయం, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో భూమిరెడ్డి, సంఘం వైస్ చైర్మన్ సత్తయ్య, డైరెక్టర్లు నర్సయ్య, సుధాకర్, వెంకటనర్సింహారెడ్డి, ప్రభాకర్‌రావు, రామచంద్రారెడ్డి, సతీష్, ఏఈవోలు లక్ష్మణ్, శ్రీశైలం, ముకుంద్‌కుమార్, సంఘం సీఈవో కిషోర్‌కుమార్, రైతులు ఎల్లయ్య, లక్ష్మన్, అశోక్, పద్మారెడ్డి, ఆనందం, బాబు, నారాయణ, శ్రీపాల్‌రెడ్డి, హసన్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



విద్యార్థినిని సన్మానిస్తున్న డీఐఈవో

ఎల్లారెడ్డిపేట, జూలై 3: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగి కన్న కలలను సాకారం చేయాలని డీఐఈవో మోహన్ అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బుధవారం సన్మానించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జూలై 3 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం రాజన్నను దర్శించుకున్నారు.





ఆలయ ప్రాంగణం, ఆది శ్రీనివాస్‌ను కలిసిన ఈవో వినోద్‌రెడ్డి

సీఎం చొరవతోనే రైతులకు కోడెల పంపిణీ



పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్

వేములవాడ కల్చరల్, జూలై 3: సీఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే రైతులకు ఉచిత కోడెల పంపిణీకి శ్రీకారం చుట్టామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి గోశాలలోని కోడెలను, ఆవులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి అర్హులైన రైతులకు బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజరాజేశ్వర సన్నిధిలో కోరిన కోరికలు తీరితే నిజ కోడె కడుతామని భక్తులు మొక్కి, నిజ కోడెను స్వామివారికి సమర్పించడం ఆనవాయితీ అన్నారు. గోశాలలో 400 గోవుల సామర్థ్యం ఉందని, ప్రస్తుతం 1500 పైగా కోడెలు, ఆవులు ఉండడంతో ఇబ్బందులు ఎదరవుతున్నాయని అన్నారు. అర్హులైన పేద రైతులకు, ఇతర గోశాలలకు ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. సీఎం ప్రత్యేక చొరవతోనే పేద రైతులకు కోడెల పంపిణీ చేపట్టామని అన్నారు. గోశాలలో కోడెల సంరక్షణకు వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, గోశాలలో అదనపు షెడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని అన్నారు. కోడెలను ఇతరులకు విక్రయించడానికి వీలు లేదని, సొంత వ్యవసాయానికి మాత్రమే వినియోగించుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్హులైన రైతులకు రాజన్న కోడెలు

అర్హులైన రైతులకు మాత్రమే రాజన్న కోడెలు పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. వేములవాడ గోశాలలో కోడెల పంపిణీ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మాట్లాడారు. కోడెలను రైతులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని ఒప్పించారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరించి, అర్హులైన రైతులను ప్రత్యేక కమిటీ ద్వారా క్షేత్రస్థాయిలో విచారించి ఎంపిక చేశామన్నారు. దేవస్థాన గోశాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.కోటి 11 లక్షల మంజూరు చేసిందన్నారు. వీటితో గోశాలలో కోడెలకు అదనపు షెడ్ల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని, వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, కమిటీ సభ్యుడు మోటూరి మధుసూదన్, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ప్రతాప నవీన్ సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు తదితరులు ఉన్నారు.

ఆగస్టులో రుణమాఫీ చేసి తీరుతాం

తంగళ్లపల్లి, జూలై 3: రుణమాఫీ ఆగస్టులో చేసి తీరుతామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణ ప్రారంభోత్సవం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుట్టలు రాళ్ల సాగుకు పనికిరాని భూమికి అనర్హులైన వారికి గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చిందని, తాము అర్హులైన రైతులకే రైతు బంధు ఇస్తామని వెల్లడించారు. నేతన్న, రైతన్నల సమస్యలను పరిష్కరించి అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, గడ్డం నరసయ్య, ఆకునూరి బాలరాజ్, సూర దేవరాజ్, వైద్య శివప్రసాద్, జలగం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

సరైన పత్రాలు చూపి వాహనాలు తీసుకెళ్లవచ్చు

సిరిసిల్ల క్రైం, జూలై 3: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను సరైన పత్రాలు చూపెట్టి తీసుకెళ్లవచ్చని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 55 వాహనాలు ఉన్నాయని, ఆరు నెలలకు వాహనాలను వేలం వేయనున్నామని పేర్కొన్నారు. సమాచారం కోసం 8712656428, 9000910619లోసంప్రదించాలని తెలిపారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం

ఇల్లంతకుంట, జూలై 3: మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలలో తూముకుంట నరేందర్‌రెడ్డి, కటకం రజిత బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని పావని, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బట్టుపద్మశ్రీనివాస్ పాల్గొన్నారు.

పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

● ప్రాజెక్టులోకి 4,630 క్యూసెక్కులు రాక

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,762 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 11.125 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 4.980 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

రాజన్న ఆలయంలో బ్రేక్ దర్శనం అమలుకు ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్, జూలై 3 : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులకు బ్రేక్ దర్శనం వెసులుబాటును కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో బ్రేక్ దర్శనం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు చేస్తున్న ప్రయత్నం ఎట్టకేలకు ఫలించనుంది. బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని దానికి సంబంధించిన వివరాలను రాష్ట్ర దేవదాయశాఖ కార్యాలయానికి పంపించినట్లు రాజన్న ఆలయాధికారులు తెలిపారు. ప్రతిపాదనలు వచ్చిన వెంటనే బ్రేక్ దర్శనం ఏర్పాటు చేసున్నారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు బ్రేక్ దర్శనం చేసుకునేందుకు వీలుగా ఒక్కొక్కరికి రూ. 300 టికెట్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి నిత్యం ఉదయం 10.15 గంటల నుంచి 11.15 వరకు గంటపాటు బ్రేక్ దర్శనం, సాయంత్రం 4 గంటల సమయం నుంచి 5 గంటల వరకు గంటపాటు బ్రేక్ దర్శనం వెసులుబాటు అందుబాటులోకి తీసువస్తున్నట్లు తెలిసింది. రాజన్న ఆలయంలోని ఉత్తర ద్వారం ద్వారా బయటకు వెళ్లు దారి నుంచి గంటపాటు బ్రేక్ దర్శనం లైన్‌ను, లేక ప్రత్యేకమైన ఫై ఓవర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

కరీంనగర్ బస్టాండ్‌లో చోరీకి యత్నం

● పట్టుకున్న ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది

కరీంనగర్ క్రైం, జూలై 3: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక పాత నేరస్థుడు ఒక వ్యక్తి జేబులో నుంచి పర్సు దొంగలించే యత్నం చేస్తుండగా రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నామని ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. ఐదు సంవత్సరాల కిందట బస్టాండ్‌లో దొంగతనానికి పాల్పడిన కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన చిలుక రాజు మళ్లీ బుధవారం బస్టాండ్‌లో ఒక ప్రయాణికుడి జేబులో చేతులు పెట్టి దొంగతనానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారులు నిందితుడిని మూడో టౌన్ పోలీసులకు అప్పగించామని తెలిపారు. ఏటీఎం కృష్ణ, ఐసిఎస్ రావు, ఏఎస్ఐ లక్ష్మి, కానిస్టేబుల్ బివి రమణ, విజిలెన్స్ సెక్యూరిటీ ప్రదీప్, మానస, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక మృతి

చందుర్తి, జూలై 3: కుటుంబ కలహాలతో ఓ బాలిక ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతున్న బాలిక బుధవారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం బండపల్లికి చెందిన కుమ్మరి శ్రీవాణి(15)అనే బాలిక ఈ నెల 1న కుటుంబ కలహాలతో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీవాణి మృతి చెందింది. ఈ సంఘటనపై తల్లి లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


సత్తక్కపల్లిలో ఊరేగింపుగా బోనాలతో భక్తులు

మెట్‌పల్లి రూరల్, జూలై3: మండలంలోని సత్తక్కపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల పండుగను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం భక్తులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు ఇంటికొక బోనాన్ని భక్తిశ్రద్ధలతో తయారు చేశారు. తయారు చేసిన బోనం భక్తులు నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాలతో ఊరిగేంపుగా ఆలయానికి బయలుదేరారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు, అధిక దిగుబడులతో రైతులు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నారు. బోనంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ జాతర

మానకొండూర్ : మండలంలోని కొండపల్కల గ్రామంలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఎల్లమ్మ పట్నాలు, జాతర ఘనంగా జరిగింది. ఈ జాతరలో గౌడ కులస్థులతో పాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతరలో సంఘం నాయకులు మల్యాల మొగిలి, నల్లగొండ రాములు, దూలం సంపత్, బోంగోని కనుకయ్య, మాజీ సర్పంచు కొరిమి పితాంబర్, మల్యాల రాములు, కొరిమి విష్ణు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేంపేటలో హరితహారం చెట్లు నరికివేత

మెట్‌పల్లి రూరల్, జూలై, 3 : మండలంలోని వేంపేట గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికివేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం పథకం నీరుగారిపోతోంది. హరితహారం పథకం కోసం ప్రతియేటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు గొడ్డలి వేటుకు గురువుతున్నాయి. వేంపేట గ్రామ శివారులో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు పూర్తిగా విద్యుత్ లైన్ కిందనే అధికంగా ఉన్నాయి. ఈ మొక్కలు ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లకు అంటుకొనే ప్రమాదం ఉందని సుమారు 100కు పైగా చెట్లను నరికివేశారు. ఈ విషయంపై కార్యదర్శిని అడగగా రోడ్డు పక్కన ఉన్న రైతులు నరికి వేసి ఉంటారని పలువురు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం హరితహారంలో చెట్లను నాటండి అని చెబుతుంటే కొందరు అందుకు విరుద్ధంగా నడుచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయంపై ఇంచార్జి ఎంపీడీవో రామకృష్ణను ఫోన్ ద్వారా వివరణ కోరగా విషయం తెలయదు, తమ దృష్టికి బుధవారం వచ్చిందని, చెట్లను నరికింది ఎవరనే విషయంలో విచారణ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సంపదను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


వేంపేట శివారులో నరికి వేసిన చెట్లు

10 నుంచి పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్,జూలై3: ఎస్‌యూ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెస్సీ విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 10నుంచి 16వ తేదీ వరకు జరగనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై3: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా www.tgbcstudycircle. cgg. gov.in వెబ్‌సైట్‌లో శుక్రవారం వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 8,9,15,16,22,23,30,31తేదీల్లో ఉదయం 10గంటల నుంచి 12:30 వరకు, మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 0878-68686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

గణేశ్‌నగర్, జూలై 3: పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెండు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎం.జ్ఞానప్రకాష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి టీఎస్-పాలీసెట్ 2024 పరీక్షలో ఉత్తీర్ణులైన ఎంబైపీసీ ర్యాంక్ విద్యార్థులు అర్హులు. ఈ యూనివర్సిటీ పరిధిలో నాలుగు పశుసంవర్థక పాలిటెక్నిక్ కళాశాలలు, మహబూబ్‌నగర్, మామునూర్ (హనుమకొండ జిల్లా), సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలో మొత్తం 110 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ రంగంలో వెటర్నరీ అసిస్టెంట్, ప్రైవేటు రంగంలో డెయిరీ, పౌల్ట్రీఫార్మ్, పెట్ హాస్పిటల్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా వున్నట్లు తెలిపారు. కోర్సుల్లో చేరడానికి ఆసక్తి గల విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.tsvu.edu.inలో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 20లోపు దరఖాస్తు చేయవచ్చని తెలియజేశారు.

కుక్కల దాడిలో వృద్ధ దంపతులకు గాయాలు

జమ్మికుంట రూరల్, జూలై3: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన రామ్ కనుకమ్మ, రామ్ బోషయ్య వృద్ధ దంపతులు కొంత కాలంగా అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నారు. బుధవారం ఇంట్లో పడుకొని ఉన్న వృద్ధ దంపతులపై వీధి కుక్కలు దాడి చేశాయి. కనుకమ్మకు కుక్కల దాడిలో కాలుకు గాయాలయ్యాయి. గ్రామస్థులు 108కి సమాచారం అందించడంతో హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

» 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్

» ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'



ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

» టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

» సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ

» కనీస చర్యలూ తీసుకోని వైనం

» ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్ర్కీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

పిడుగుపాటు కాదు..అంతర్గత లోపమే

» 'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ జరిగి పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ. 30 కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీ లించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలకు నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

» మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక..

» ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

» చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి



అనిత (ఫైల్) రమ్య (ఫైల్)

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడకు చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) చదువుకుంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మి, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

» చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం

» 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగుల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటిదాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లులుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్లపాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

కూలిన 'నిర్లక్ష్యం'

● కుప్పకూలుతున్న మానేరు వంతెన గర్డర్లు

● ఈ ఏడాది ఏప్రిల్‌లో మూడు.. తాజాగా ఐదు..

● తొమ్మిదేళ్లుగా సాగుతున్న నిర్మాణ పనులు

ముత్తారం, జూలై 3: ఏళ్ల తరబడి సాగుతున్న పనులు.. నాణ్యతా లోపం.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం.. వెరసి నిర్మాణ దశలో ఉన్న వంతెన గర్డర్లు కుప్పకూలాయి. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామాల మధ్య మానేరు వాగుపై సుమారు తొమ్మిదేండ్ల క్రితం ఈ వంతెన పనులు మొదలుపెట్టారు. నాటి నుంచి నత్తనడకన సాగుతున్న వంతెన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందా అని రెండు జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కాగా మంగళవారం రాత్రి కురిసిన ఈదురుగాలుల వర్షానికి 17-18 నంబర్ పిల్లర్లపై గర్డర్లు పెద్ద శబ్దంతో కిందపడ్డాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పనులు మొదలుకాగా, పనుల్లో అలసత్వం, ఆలస్యం తాజా ఘటనకు కారణంగా కనిపిస్తున్నది. గాలి దుమారమే ఘటనకు కారణమని చెబుతున్నా, వారి నిర్లక్ష్యమే కారణం స్థానిక ప్రజానీకం మండిపడుతున్నది.

● మూడు నెలలైనా కాకముందే..

ఓడెడు వంతెనలోని 10-11 పిల్లర్ల మధ్యలో ఉన్న మూడు గర్డర్లు ఈదురుగాలులకు ఈ ఏడాది ఏప్రిల్ 22న రాత్రి ఇదే విధంగా నేలమట్టం అయ్యాయి. రెండేళ్లుగా వాగు ఉప్పొంగి ప్రవహించడంతో, గర్డర్లకు సపోర్టుగా పెట్టిన చెక్కలు దెబ్బతిన్నాయి. ఈ కారణంగానే గర్డర్లు నేలకూలాయి. ఈ సంఘటన జరిగి మూడు నెలలైనా గడవకముందే మంగళవారం రాత్రి 17-18 నంబర్ పిల్లర్లపై గర్డర్లు నేలకూలాయి. ఏప్రిల్‌లోనే అధికారులు అప్రమత్తమై ఉంటే తాజా ఘటన జరిగి ఉండేది కాదని ప్రజలు మండిపడుతున్నారు. కూలిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.



మంగళవారం రాత్రి కూలిన గడ్డర్లు



గతంలో కూలిన గర్డర్లను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు(ఫైల్)

● గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం

రెండు జిల్లాల మధ్య దూరాన్ని తగ్గించేందుకు 2016లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.49కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించింది. గత ప్రభుత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఈటల రాజేందర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి కూడా ఈ వంతెన పనుల్లో ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి. వానాకాలంలో తరచూ వరదలు రావడం.. సామగ్రి దెబ్బతినడం ప్రధాన సమస్యగా మారింది. దీంతో పాటు కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో జాప్యం నెలకొంది. మధ్యలో మరో రూ.11కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పనులు ఆలస్యమవడం, అధికారుల పర్యవేక్షణ లోపించడంతో వంతెన దెబ్బతిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి వంతెనను త్వరగా పూర్తిచేయాలని తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. పనులు మళ్లీ వేగంగా మొదలవుతాయని ఆశించిన స్థానిక ప్రజలకు మరోసారి నిరాశే ఎదురైంది. ఇటీవల వంతెనను సందర్శించిన అధికారులు పనుల్లో నాణ్యతా లోపం ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. కాగా, కొత్తగా బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు వేయాలని, అదేవిధంగా పనులు మధ్యలో నిలిపేసిన గత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మధ్యమానేరు వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో రెండు జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. మట్టి రోడ్డు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు.

మృత్యువుతో పోరాడుతున్న మహిళ

- ఒంటరిగా మిగిలిన మూడేళ్ల కుమారుడు
- వైద్యం కోసం ఎదురు చూస్తున్న కుటుంబం

గంగాధర, జూలై3: అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఓ మహిళ మృత్యువుతో పోరాడుతోంది. గంగాధర మండల కేంద్రానికి చెందిన విశ్వనాథం శ్రీనివాస్ కుమార్తె హరిణి(26) నెల రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లగా వివిధ పరీక్షలు నిర్వహించి మెదడు వాపునకు కారణమయ్యే తీవ్రమైన ఎన్‌సెఫలైటిస్ వ్యాధిగా వైద్యులు నిర్ధారించారు. ఇరవై రోజులుగా హరిణి పరిస్థితి రోజురోజుకూ దిగజారి ప్రాణా పాయ స్థితికి చేరింది. ఆపరేషన్ చేస్తే కానీ మెరుగుపడదని తక్షణం రూ.30లక్షలు సమకూర్చుకోవాలని వైద్యులు సూచించారు. ఇప్పటికే అప్పులు చేసి 20 లక్షల పైచిలుకు ఖర్చు చేసి వైద్యం చేయించామని తండ్రి శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్యశాలలో మృత్యువుతో పోరాడుతున్న హరిణిని కాపాడాలని తండ్రి శ్రీనివాస్ వేడుకుంటున్నాడు. ప్రభుత్వం స్పందించి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నాడు. మృత్యువుతో పోరాడుతున్న తన తల్లి విషయం తెలియని మూడేళ్ల కుమారుడు ఒంటరిగా మిగిలాడు.

ఒకరి రిమాండ్

ముస్తాబాద్, జూలై 3 : మండలంలోని గూడూరు గ్రామంలో మైనర్‌ను కిడ్నాప్ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామానికి చెందిన బత్తిని ప్రశాంత్ మైనర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి కిడ్నాప్ చేశాడని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం కిడ్నాప్ చేసిన ప్రశాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

షార్జాలో కొత్తపేటవాసి ఆత్మహత్య



శేఖర్ (ఫైల్)

రాయికల్, జూలై3: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన తునికి శేఖర్(27) షార్జాలో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిసింది. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. శేఖర్ నెల రోజుల క్రితం బల్దియా కంపెనీలో పనినిమిత్తం వెళ్లాడు. జూన్ 22న శేఖర్ అక్కడే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం గ్రామస్థులకు సమాచారం అందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

కారు ఢీకొని విద్యుత్ స్తంభాలు ధ్వంసం

మల్యాల, జూలై 3: కొండగట్టు కొండపైన గల బొజ్జపోతన ఆలయం వద్ద ఓ కారు ఢీకొట్టిన సంఘటనలో మూడు విద్యుత్ స్తంభాలు ధ్వంసం అయ్యాయి. ముగ్గురు వ్యక్తులు గత సోమవారం తెల్లవారు జామున టీజీ22జీ4149కారులో వస్తూ నిర్లక్ష్యంగా వాహనం నడుపడంతో రహదారి పక్కన గల స్తంభాలు విరిగిపోయాయని ట్రాన్స్‌కో రామన్నపేట సెక్షన్ ఏఈఈ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు

బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 3: బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న రాజస్థాన్ హోటల్ యజమానిపై ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అధికారులు బుధవారం కేసు నమోదు చేశారు. కరీంనగర్‌లో ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అశోక్‌నగర్ ప్రాంతంలో దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా రాజస్థాన్ జై రామ్ దేవ్ బాబా హోటల్లో 14 సంవత్సరాలలోపు బాలుడు పనిచేస్తుండగా రెస్క్యూ చేసి బాలల సంక్షేమ సమితి ముందు హాజరు పరిచారు. అధికారుల ఆదేశాల మేరకు బాలుడిని షెల్టర్ హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. అనంతరం మూడో ఠాణాలో హోటల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ చెక్రధర్‌రెడ్డి, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, ఆపరేషన్ ముస్కాన్ ఇంచార్జి ఎస్ఐ అన్వర్, టీం సభ్యులు సాగర్, కవిత పాల్గొన్నారు.

ఖనిలో చోరీ

కోల్‌సిటీ, జూలై 3: గోదావరిఖని జీఎం కాలనీలో ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగలు తులం బంగారం, 70తులాల వెండి ఎత్తుకెళ్లినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. జీఎం కాలనీలో నివాసముండే ఎడ్ల పద్మ అనే గృహిణి పది రోజుల క్రితం ఊరికి వెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో బీరులో ఉన్న తులం బంగారం, 70తులాల వెండిని దొంగలు ఎత్తుళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కరీంనగర్ జైలు నుంచి ఆరుగురు ఖైదీల విడుదల

కరీంనగర్ క్రైం, జూలై 2: వివిధ కేసుల్లో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న ఆరుగురు ఖైదీలు బుధవారం విడుదల అయ్యారు. శిక్ష సమయంలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి రాష్ట్ర వ్యాప్తంగా 213 మంది ఖైదీలను విడుదల చేసింది. కరీంనగర్ జిల్లా నుంచి ఏడుగురు ఖైదీల విడుదలకు ప్రతిపాదనలు వెళ్లగా ఆరుగురు ఖైదీలు విడుదలయ్యారు. హత్య కేసుల్లో జీవితఖైదు శిక్ష పడిన ఆరుగురు ఖైదీలను మంగళవారం కరీంనగర్ జిల్లా జైలు నుంచి హైదరాబాద్ చర్లపల్లి జైలుకు తరలించారు. వీరందరికీ అక్కడ కౌన్సెలింగ్ నిర్వహించిన జైలు ఉన్నతాధికారులు, వారికి ఉపాధి చూపించి విడుదల చేశారు. ఇందులో ముగ్గురికి కరీంనగర్ జైలు పెట్రోల్ బంక్‌లో ఉపాధి కల్పించారు. కరీంనగర్ జిల్లా జైలు నుంచి 2010 నుంచి ఖైదీలుగా ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన మెచ్చే మధు, ముచ్చె ఆశయ్య, ముచ్చె గంగయ్యలతో పాటు ఎస్‌కే ముస్తాక్, సయ్యద్ జుబేర్, పవార్ రాజులు విడుదలయ్యారు. వీరు ఆరుగురు జైలు నుంచి విడుదల అయిన తరువాత శాంతియుతంగా, సత్ప్రవర్తనతో ఉంటానని 50 వేల రూపాయల స్వంత పూచీ కత్తు బాండ్‌పై విడుదల అయ్యారు. గతంలో వీరికి విధించిన శిక్షాకాలం పూర్తి అయ్యేవరకు వారి గ్రామం పరిధిలోని పోలీసు ఠాణాలో ప్రతి 3 నెలలకు ఒకసారి తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. ఏదైనా నేరాలలో పాల్గొంటే రద్దు చేసిన శిక్షను మళ్లీ యదావిధిగా విధిస్తారు.

అట్రాసిటీ కేసుల్లో పరిహారం సకాలంలో అందించాలి

● ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి ● జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్



మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారం బాధితులకు సకాలంలో అందించాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పారదర్శకంగా ప్రజలకు సేవ చేయాలని, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాలకు వచ్చిన ఆయన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను, విద్య, వైద్యం, రుణాలు, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల వారీగా అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. రెవెన్యూ శాఖ, విద్యాశాఖ, పంచాయతీ రాజ్, పరిశ్రములు, ఎస్సీ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ, ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వివరాల ప్రగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క అధికారి క్రమ శిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. అర్హులను మాత్రమే ఎంపిక చేసి లబ్ధి చేకూరేలా చూడాలని, ప్రభుత్వ నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను కట్టుదిట్టంగా పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు సునీల్ కుమా ర్ బాబు, రిసర్చ్ అధికారి వరప్రసాద్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీలకు రావాల్సిన హక్కులను అందించాలి

రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఎస్సీలకు రావాల్సిన హక్కులు వారికి అందుతున్నాయా లేదా పరిశీలించి సకాలంలో అందించాలని అధికారులను ఆదేశించామని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలకు కేటాయించిన అసైన్డ్ ల్యాండ్ పట్టాలు అందించే అవకాశంపై రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. విదేశీ విద్యా పథకం, గురుకుల పాఠశాలలో ఎస్సీ విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్‌పై రివ్యూ చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సకాలంలో పరిష్కరించాలని, వీటిపై పార్లమెంట్ 2018లో 18 ఏ సెక్షన్ కింద ఎస్సీలు అందించిన ఫిర్యాదులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్థులను అరెస్టు చేయాల్సి ఉంటుందన్నారు. అన్యాయం జరిగిన నిమ్న వర్గాల ప్రజలకు అండగా ఎస్సీ కమిషన్ ఉంటుందన్నారు. సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు సునీల్ కుమార్‌బాబు, రీసర్చ్ అధికారి వరప్రసాద్‌లు పాల్గొన్నారు. జగిత్యాలకు వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్‌ను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రాంచందర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



హన్మాజిపేటలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్

వేములవాడ రూరల్, జులై 3: వర్షాకాలంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తోకలిసి మల్లారం కట్టుకాలువ, మూలవాగుపై పునరుద్ధరణ చేపడుతున్న జయవరం, బొల్లారం చెక్ డ్యామ్‌లను, హన్మాజిపేట, మర్రిపల్లి, నక్కవాగుపై నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జిపనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పలు శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలంలోని కొట్టుకుపోయిన పెంటివాగు బ్రిడ్జి, మూలవాగు కాజ్‌వేలను, వట్టిమల్ల, నసుగుల రోడ్డును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో కాజ్‌వేల నిర్మాణం చేపడ తామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మూలవాగుపై కాజ్‌వేల నిర్మాణం చేపట్టామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా కాజ్‌వేల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే వాటిని పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్ పాషా, కచ్చకాయల ఎల్లయ్య, పల్లె రవీందర్ రెడ్డి, నందు గౌడ్, యాస్మిన్ భాష పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటాం



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

వేములవాడ టౌన్, జూలై 3 : వేములవాడ మండల అభివృద్ధికి సహకరించిన ప్రజలకు, అధికారులకు ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటామని జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రవ్వ అన్నారు. గురువారంతో జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండడంతో ఎంపీడీవో శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనప్పటి నుంచి నేటి వరకు అభివృద్ధితో తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి, ప్రజలకు చేసిన సేవ ఎప్పటికీ గుర్తుంటదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వనపర్తి దేవరాజు, ఎంపీటీసీలు ఆర్సీరావు, గాలిపెల్లి సువర్ణస్వామి, బుర్ర లహరికశేఖర్, బాస రాజశేఖర్ కో ఆప్షన్ సభ్యులు ఎండీ జమాల్, కార్యదర్శులు ఆమని, జీవిత, వెంకట్ తదితరులు ఉన్నారు.

వేములవాడలో..

వేములవాడ రూరల్: మండల సర్వసభ్యసమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బండ మల్లేశం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పలు శాఖల అధికారులు నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం నేటితో ముగుస్తున్నందున వారిని ఎంపీపీ బండ మల్లేశం, ఎంపీడీవో శ్రీనివాస్ శాలువాలతో సన్మానించారు. పదవీకాలం ముగిసినప్పటికీ సభ్యులందరం మండల అభివృద్ధికి కలిసి పని చేయాలని ఎంపీపీ బండ మల్లేశం అన్నారు. సెస్ రూరల్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, ఎంపీటీసీలు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట: పదవీవిరమణ పొందుతున్న ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, వైస్ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, ఎంపీటీసీలు గడ్డమీది నాగలక్ష్మి, పర్శరాం, కిషోర్‌గౌడ్, నాయిని స్రవంతిరమేష్‌ని మండల కేంద్రంలో బుధవారం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్జల రాజశేఖర్‌గౌడ్, కొయ్యడ రాజయ్య, కొయ్యడ భాస్కర్, దొడ్ల దేవేందర్, గుండ రవీందర్,భూపతి, మల్లయ్య, తిరుపతి, భాస్కర్, శ్రీనివాస్, చందు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండ మల్లేశం

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

సిరిసిల్ల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గీతానగర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. విద్యార్థులు దూస మనోజ్, మిట్టపల్లి రఘునందన్, బద్దెపూరి మోహరా, దూస శ్రీచరణ్, అడెపు అక్షయ, కుసుమ రామయ్య జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్షనపల్లి నందిని, ఒగ్గు నవ్యశ్రీ, కళ్యాడపు అక్షయ, పులి అక్షయ, అనంతుల అభిషేక్ ఎంపికయ్యారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, కోనరావుపేట విద్యార్థులు ప్రతిభ చాటారు.

నేడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ

సిరిసిల్ల టౌన్, జులై 3: సిరిసిల్ల పట్టణం వాసవి కల్యాణ మండపంలో గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి నిర్వహించనున్నట్లు ప్రజా సంఘాల జిల్లా నాయకులు తెలిపారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా దొడ్డి కొమరయ్య వర్ధంతిని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ కనకయ్య, బీసీ సంక్షేమ సంఘం నాయకులు వీరవేణి మల్లేశం, పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోనె ఎల్లప్ప పాల్గొన్నారు.

16 వేల శివ లింగాల తయారీ

గంభీరావుపేట, జూలై 3 : గంభీరావుపేట మండల కేంద్రంలోని అచ్చయ్య స్వామి ఆలయంలో స్థానిక ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాశీలో కోటి పార్థీవ శివలింగార్చన లక్షా బిల్వార్చన కోసం బుధవారం 16 వేల పార్థీవ లింగాలను మహిళలు తయారు చేశారు. లోక కల్యాణార్థం వారణాసీలోని కాశీ క్షేత్రంలో గంగానది ఒడ్డున కేదార్ కండము ముముక్షు భవన ప్రాంగాణంలో కోటీ పార్థీవ శివలింగార్చన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అందులో భాగంగా స్థానిక అచ్చయ్యస్వామి ఆలయంలో లింగాలను తయారు చేసినట్టు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు.

బీఆర్ఎస్ అసమర్థ పాలనతో సీఎం రిలీఫ్ ఫండ్ ఫైళ్లు వెనక్కి

సిరిసిల్ల టౌన్, జులై 3: బీఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో సీఎం రిలీఫ్ ఫండ్ ఫైళ్లు వెనక్కి వస్తున్నాయని కాంగ్రెస్ కౌన్సిలర్లు భూక్య రెడ్యానాయక్, కుడికాల రవికుమార్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకు గురై, అనారోగ్యాల పాలైన పేదలు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో కొంత వస్తుందన్న ధీమాతో అప్పులు చేసి వైద్యం చేయించుకుంటే గత అసమర్థ ప్రభుత్వంతో ఆ ఫైళ వెనక్కి వస్తున్నాయని ఆరోపించారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా సీఎం రిలీఫ్ ఫండ్ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చొరవ తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాని, బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ వేముల రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నమనేని కమలాకర్‌రావు, గుండ్లపల్లి గౌతమ్ బాధితులు పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాలేదా?

ఇల్లంతకుంట, జూలై 3: బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు నైతిక విలువలు గుర్తుకు రాలేదా? అని కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి ప్రశ్నించారు. మండలకేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరికలు పెరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలను రాజీనామా చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోరడంలో అర్థం లేదని విమర్శించారు. సమావేశంలో నాయకులు కరివెద కర్ణాకర్‌రెడ్డి, బదుగు లింగం, చిక్కుడు సత్యం, బెజ్జంకి శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సముచిత స్థానం

ఎల్లారెడ్డిపేట, జూలై 3: ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలను చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి గురువులకు సముచిత గౌరవం కల్పించారని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మర్వాడి గంగరాజు, కదిరె శ్రీనివాస్‌గౌడ్‌లు అన్నారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి బుధవారం ఉపాధ్యాయులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గంగరాజు, శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఎస్జీటీలు, భాషా పండితులు, వ్యాయమ ఉపాధ్యాయులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించి కలను నెరవేర్చిందన్నారు. కాంగ్రెస్ నాయకుడు బాల్‌రెడ్డి, ఉపాధ్యాయల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట, జూలై 3: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెంటం కుమార్ కుటుంబానికి బీఆర్ఎస్ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును స్థానిక ప్రజాప్రతినిధులు బుధవారం పంపిణీ చేశారు. ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీలు నాగరాజు, అనసూయ, పద్మ, రజిత, నాయకులు సందీప్, వెంకట నర్సింహారెడ్డి, అజీమొద్దీన్, అప్సరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

పలువురికి కొండూరు పరామర్శ

గంభీరావుపేట, జూలై 3 : గంభీరావుపేట మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను బుధవారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పరామర్శించారు. కుశిగుంపుల వినోద, మద్దెవేని నారాయణ, మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, పట్టణ అధ్యక్షుడు పెద్దవేణి వెంకటి, నాయకులు వహీద్, ఎగదండి స్వామి, బండ రమేష్, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలవాలి



భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

తంగళ్లపల్లి, జూలై 3: ప్రజలకు ప్రభుత్వానికి జర్నలిస్టులు వారధిగా నిలవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్ నూతన భవనాన్ని జడ్పీటీసీ పుర్మాణి మంజుల లింగారెడ్డి, ఎంపీపీ పడిగెల మానస రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజాన్ని చైతన్య పర్చడంలో ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందన్నారు. ఒక్కో పాత్రికేయుడు వంద మందితో సమానమని, విలువలతో కూడిన జర్నలిజం సమాజాన్ని మంచి మార్గంలో నడిపిస్తుందని అన్నారు. ప్రెస్ క్లబ్ అదనపు నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. స్థానిక ఎంపీటీసీ కోడి అంతయ్య, ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్ గడ్డం నర్సయ్య, చొప్పదండి ప్రకాష్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, వైద్య శివప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, ప్యాక్స్ వైస్ చైర్మన్ఎగుమామిడి రమణారెడ్డి, నాయకులు గడ్డం మధు, నేరెళ్ల నర్సింగం, మోర లక్ష్మిరాజం, ఎగుర్ల ప్రశాంత్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రంగు శ్యాం, ఉపాధ్యక్షుడు సిరిపాక ప్రణయ్, కోశాధికారి గోనపల్లి పర్శరాములు, సహాయ కార్యదర్శి దుబ్బాక రాజు, సాంస్కృతిక కార్యదర్శి కలికోట చందు, కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్డి రాజశేఖర్, సలహాదారులు, సీనియర్ పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

నీట్ రద్దు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జులై 3 : నీట్ రద్దు చేయాలని, పరీక్ష పత్రాల లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం నేతన్న చౌక్ వద్ద విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడుతూ దేశ వ్యాపంగా నిర్వహించిన నీట్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫలితాలు జూన్ 14న విడుదల కావల్సి ఉండగా జూన్ 4న విడదల చేయడంపై అనుమానం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత మూడు రాష్ట్రాలలోనే నీట్ పేపర్ లీకేజీ కావడం చూస్తే ప్రధాన మంత్రి మోదీకి విద్యార్థులపై ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు. తమిళనాడు ప్రభుత్వం మాదిరిగానే తెలంగాణ ప్రభుత్వం కూడా నీట్ రద్దు వ్యవహారంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్వీ నాయకులు మట్టె శ్రీనివాస్, ఒగ్గు అరవింద్, కోడం వెంకటేష్, నడిగట్ల సందీప్, వావిలాల సాయి, నరేష్, తిరుపతి, భాను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల కోసం లబ్ధిదారుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

రుద్రంగి, జూలై 3 : కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని, ఒక రోజు ముందుగా మానల గ్రామపంచాయతీ వద్దకు రావాలని ఉమ్మడి మానాల లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు సమాచారాన్ని ఇచ్చారు. దీంతో లబ్ధిదారులకు కొన్ని అనివార్య కారణాలతో చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని అధికారులు తెలిపారు. దీంతో 24 మంది లబ్ధిదారులు రుద్రంగి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి చెరుకొని తమ చెక్కులను పంపిణీ చేయాలని కార్యాలయం ఎదుట, కార్యాలయం లోపల కూర్చొని ఆందోళనకు దిగారు. ఆందోళన చేస్తున్న లబ్ధిదారులతో తహసీల్దార్ శ్రీలత రెండు, మూడు రోజుల్లో చెక్కులను పంపిణీ చేస్తామన్నారు. నచ్చచెప్పి ఆందోళనను విరమింపజేశారు.

ఘనంగా డాక్టర్స్ డే

సిరిసిల్ల టౌన్, జులై 3: సిరిసిల్ల పట్టణంలో బుధవారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే నిర్వహించారు. పట్టణానికి చెందిన డాక్టర్ రాజేందర్, డాక్టర్ చందనను సన్మానించారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య మాట్లాడారు. ప్రజా సేవలో వైద్యులు ముందుండాలని, వైద్యులు దేవుళ్లతో సమానమని అన్నారు. కార్డులు ఉన్న సీనియర్ సిటీజన్స్‌కు ఉచిత వైద్యం అందించాలని కోరారు. వైద్యులు రాజేందర్, చందన మాట్లాడుతూ కార్డులు ఉన్న సీనియర్ సిటిజన్స్‌కు ఫీజు లేకుండా వైద్యం అందిస్తామన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి దొంత దేవదాసు, సహాయ కార్యదర్శులు గౌరిశెట్టి అనందం, బుస్స భూమలింగం, కోడం శంకర్, వికృతి ముత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో సన్మానిస్తున్న సిటీజన్స్

మత్స్యకారులకు పథకాలు అందించాలి



మాట్లాడుతున్న రామచంద్రం

సిరిసిల్ల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలను అందించాలని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రామచంద్రం అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని మత్స్య శాఖ కార్యాలయంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జిల్లాలోని 116 ప్రాథమిక సహకార సంఘాల సభ్యులతో సర్వసభ్య సమావేశం ఏర్పాటుపై చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, సంఘం వైస్ చైర్మన్ అంబటి శేఖర్, డైరెక్టర్ గాడిచెర్ల దేవయ్య, శ్రీనివాస్, జెట్టి దేవయ్య నిమ్మల బాబు, పిట్టల బాబు, పల్లి శివరామకృష్ణ, పర్శారాములు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు

వేములవాడ కల్చరల్, జూలై 3: పాడి, పంటలు, పిల్లపాపలను చల్లంగా చూడు పోచమ్మ తల్లీ అంటూ వేములవాడ పట్టణంలో బుధవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీనగర్, సుభాష్‌నగర్‌లోని అంబేడ్కర్ వార్డు మహిళల ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మకు బోనాలను తీశారు. ఈ సందర్భంగా ఇంటింటికి మట్టికుండల్లో అమ్మవారికి నైవేద్యాన్ని వండగా, యువతులు సాంప్రదాయ దుస్తులు ధరించి మంగళహారతులో పోచమ్మ బోనాలను తీశారు.ఈ సందర్భంగా పట్టణ పురవీదుల గుండా డప్పు చప్పుల్ల మధ్య శివసత్తుల, బైండ్లవాళ్ల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి హాజరయ్యారు. మహిళలు మున్సిపల్ చైర్‌పర్సన్‌నుఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు తదితులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

కోనరావుపేట, జూలై 3 : ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై రామచంద్రన్ గౌడ్ అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అరుణ జగన్మోహన్ రెడ్డి, నిసాని రవీందర్, హెచ్ఎం షాబుద్దీన్, ప్యాక్స్ డైరెక్టర్ రంగారెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

చందుర్తి, జూలై 3: పాఠశాలలో ఉపాధ్యాయులు చేసిన ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయని లింగంపేట ఎంపీటీసీ రమేష్‌రావు అన్నారు. చందుర్తి మండలం లింగంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రమోషన్, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కవిత, అనిత, జయమ్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలహెచ్ఎం ఉమారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మట్టి పాత్రల ప్రదర్శన

చందుర్తి, జూలై 3 : మండలంలోని మర్రిగడ్డ గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ ఫ్రీ డే సందర్భంగా మట్టి పాత్రల ప్రదర్శన కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, భార్గవి, రామస్వామి మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో జరిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ ప్లేట్లు, వాటర్ బాటిల్స్‌ను వాడొద్దన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోకుండా భూ కాలుష్యం పెరుగుతుందన్నారు. మట్టి పాత్రలు వాడాలని, మట్టి పాత్రలతో ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. మట్టి పాత్రలతో అనేక లాభాలు ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

బోయినపల్లి, జూలై 3: బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విశ్రాంత మండల విద్యాధికారి చెన్న మాధవుని రామరాజు మంగళవారం ఈ విద్యా సంవత్సరంలో ఆరవ తరగతి విద్యార్థులకు, ప్రైవేటు పాఠశాల నుంచి ఈ పాఠశాలకు కొత్తగా జాయిన్ అయిన ఎనిమిది మంది విద్యార్థులకు 4 వేల విలువ గల ఇంగ్లీష్ డిక్షనరీలుతోపాటు విద్యార్థులందరికీ పెన్నులు ఉచితంగా ప్రధానోపాధ్యాయులు తిరుపతి సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతున్నట్లు రామరాజు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నరసయ్య, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

చందుర్తి, జూలై 3: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. మండలంలోని ఎనగల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఉదయం నాగం కుమార్ సందర్శించారు. పాఠశాలలో ప్రతిజ్ఞ సమయానికి ఉపాధ్యాయులు రాకపోవడంతో జడ్పీటీసీ సభ్యులు, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రార్థన సమయం ముగిసినప్పటికీ ఉపాధ్యాయులు పాఠశాలకు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు లింగంపల్లి సత్తయ్య, ఎన్గంటి శంకర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కోనరావుపేట, జూలై 3: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని, జాగ్రత్తలు తీసుకుంటున్నామని కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు అన్నారు. కోనరావుపేట మండలంలో మూలమలుపు రోడ్ల వద్ద కొప్పుకొని ఉన్న చెట్ల పొదలను బుధవారం ఎక్స్‌కావేటర్ ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించే క్రమంలో భాగంగా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు రోడ్లు, మూలమలుపుల వద్ద వాహనదారులకు కనిపించకుండా పొదలు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందుకే వాటిని తొలగిస్తున్నామన్నారు.

ముదిరాజ్ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేష్

కోనరావుపేట, జూలై 3 : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన అన్నబోయిన సురేష్ ముదిరాజ్ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు పండుగ బాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన సురేష్ బుధవారం మాట్లాడుతూ ముదిరాజుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలన్నారు. ఈ ఎన్నికకు సహకరించిన బండ ప్రకాష్, పండుగ బాలు, మల్లేశం, అశోక్, సత్తయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్

బోయినపల్లి, జూలై 3: గ్రామాల అభివృద్ధి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే జరుగుతుందని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అన్నారు. బుధవారం చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల నివేదికలను సంబంధిత అధికారులు చదివి వినిపించారు. ప్రోటోకాల్ పాటించడం లేదంటూ తహసీల్దార్ పుష్పలత, ఏపీవో సబితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మండలంలోని కోరెం, మన్వాడ గ్రామాల మహిళా సంఘాలకు మంజూరైనా మీ సేవా కేంద్రాలను ఆయా గ్రామాల్లోని సంఘాలకు తెల్పకుండానే లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుందని, ఏ ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేశారని ఐకేపీ ఏపీఎం జయసుధను మండల కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ అజ్జు ప్రశ్నించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ తనకు సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల పాలకవర్గ సభ్యులను ఆయా శాఖల అధికారులు, సిబ్బంది సన్మానించారు. సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఎంపీటీసీలు అక్కెనపల్లి ఉపేందర్, కంకణాల వనజ, కొంకటి శిరీష, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవోలు జయశీల, నల్ల రాజేందర్ రెడ్డి, పీఆర్ డీఈ సత్యనారాయణ, ఎంఈవో శ్రీనివాస్, వెటర్నరీ డాక్టర్ రమేష్, ఏవో ప్రణీత, ఏఈ విష్ణువర్ధన్ సిబ్బంది పాల్గొన్నారు.

చివరి సమావేశానికి డుమ్మా కొట్టిన ఎంపీటీసీలు మండల పరిషత్ చివరి సమావేశానికి కేవలం ముగ్గురు మాత్రమే హాజరు కావడం చర్చనీయంశంగా మారింది. పరిషత్ చివరి సమావేశానికి పలువురు ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో ప్రజాప్రతినిధులు లేక సభ బోసిపోయి కనిపించింది.

ఏఎస్పీగా బాధ్యతల స్వీకరణ

వేములవాడ టౌన్, జూలై 3 : వేములవాడ ఏఎస్పీగా శేషాద్రిని రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. వేములవాడ పోలీస్ సబ్ డివిజన్‌కు వచ్చేసిన ఆమెకు సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్సైలు మారుతి, అశోక్, పృధ్వీధర్, శ్రీనివాస్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కోనరావుపేట, జూలై 3: కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన వికృతి ఎల్లయ్య దుబాయ్‌లో గత నెలలో మృతి చెందాడు. ఆ మృతుని కుటుంబానికి నిమ్మపల్లి ఎన్ఆర్ఐలు రూ. 1,17,900, నిమ్మపల్లి ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.63,800 బుధవారం అందజేశారు. పెద్దదిక్కు కోల్పోయిన ఆ పేద కుటుంబానికి పెద్ద మొత్తాన్ని అందించడం సంతోషమని గ్రామస్తులు అభినందించారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

చందుర్తి, జూలై 3 : బాలికపై అత్యాచారానికి యత్నించిన ఒకరిపై పోక్సో చట్టం కేసు నమోదైనట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. మండలంలోని మర్రిగడ్డకు చెందిన షేక్ కైఫ్ అనే యువకుడు 16 ఏళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించగా కేసు నమోదు చేసినట్లు, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ప్రజా సేవలో ముందుండాలి



సన్మానం పొందిన సభ్యులు

ఎల్లారెడ్డిపేట, జూలై 3: పదవులు లేకపోయినా ప్రజా సేవలో ముందుండాలని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రేణుక అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత ఐదేళ్ల పదవి కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకుని అనుభవాలను పంచుకున్నారు. భావోద్వేగానికి గురయ్యారు. పదవి కాలం ముగియనున్న నేపథ్యంలో సభ్యులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు సేవ చేసే అవకాశం అందరికీ లభించదని అన్నారు. ప్రజలు తమపై నమ్మకం ఉంచి కట్టబెట్టిన పదవికి గత ఐదేళ్ల కాలంలో అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని పేర్కొన్నారు. ప్రజలకు చేసిన పనులే సంతృప్తినిస్తాయని అన్నారు. అంకిత భావంతో పని చేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రజాప్రతినిధుల పదవి కాలం ముగిస్తున్న నేపథ్యంలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, వైస్ ఎంపీపీ భాస్కర్, ఎంపీటీసీలు తిరుపతిబాబు, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, మధు, నాగరాణి, అనసూయ, గీతాంజలి, పద్మ, రజిత, అపెరా సుల్తానా, మండల కో-ఆప్షన్ సభ్యుడు జబ్బార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.